క్లుప్తంగా

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

ఆగిన హైస్కూల్ పనులు



అర్ధంతరంగా ఆగిపోయిన డైనింగ్ హాల్

వరదయ్యపాళెం: సత్యవేడు మండలం మాదనపాళెం హైస్కూల్‌లో గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు ద్వారా పాఠశాల ఆధునీకరణ పనులను చేపట్టారు. రెండు విడతలలో జమ అయిన నగదు ద్వారా పలు అభివృద్ధి పనులను చేపట్టారు. అయితే సార్వత్రిక ఎన్నికల కారణంగా పనులు ఆగిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గడిచిన 11 నెలలుగా పాఠశాలలో ఆగిన పనులు తిరిగి ప్రారంభం జరగలేదు. రానున్న విద్యా సంవత్సరానికైనా ఆగిపోయిన పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రధానంగా పిల్లల అవసరం కోసం శ్లాబు దశలో ఆగిపోయిన డైనింగ్ హాల్ పూర్తి చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాల అభివృద్ధిపై దృష్టి సారించాల్సి ఉంది.

నివాళి



నివాళులర్పిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

ఏర్పేడు: శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో ఇటీవల మృతి చెందిన పాగాలి రాజేశ్వరి కర్మక్రియలకు గురువారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేశ్వరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాజేశ్వరి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సుమన్, నవీన్, సాయి, దిలీప్, పవన్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు చెల్లూరు విద్యార్థి ఎంపిక



మోడెం హేమకృష్ణ

ఏర్పేడు: మండలంలోని చెల్లూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థి మోడెం హేమకృష్ణ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శశిప్రకాష్ తెలిపారు. విద్యార్థిని ఎంఈఓలు ప్రేమలత, దయాకర్ విద్యార్థికి శిక్షణ ఇచ్చిన టీచర్లను అభినందించారు.

తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వరదయ్యపాళెం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల తహసీల్దార్ సుధీర్‌రెడ్డిని వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది గురువారం సాయంత్రం గౌరవ పూర్వకంగా కలిసి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అందరూ సమష్టిగా పనిచేసి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

ముక్కంటి సేవలో ఆర్టీసీ మాజీ చైర్మన్




ఆలయం వద్ద మల్లికార్జున్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని గురువారం ఆర్టీసీ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయన్ని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

విరిసిరిగా..

చిన్న, సన్నకారు రైతులు.. చిన్న భూ కమతాలు.. సంప్రదాయ పంటలతో నష్టాలు.. ఉద్యాన సాగుకు అనుకూల వాతావరణం.. ఎగుమతికి చక్కటి అవకాశం.. వెరసి సత్యవేడు నియోజకవర్గంలోని పలు పల్లెలు పూల సాగుపై మొగ్గు.. ఫలితంగా మంచి దిగుబడి.. అధిక రాబడితో ఆ పల్లెలు తులతూగుతున్నాయి.

- పూలతోటల సాగుపై రైతుల మొగ్గు
- పెరుగుతున్న వాణిజ్య పంటలు
- రెండు దశాబ్దాలుగా సాగు
- చెన్నైకి ఎగుమతి





సత్యవేడు: నియోజకవర్గంలోని సత్యవేడు, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో రైతులు రోజా, మల్లి, చామంతి, సంపంగి, కనకాంబరం పూల తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వరి, వేరుశనగ పంటల సాగుతో నష్టాల బారిన పడుతున్న రైతులు, ఉద్యాన పంట అయిన పూలసాగుపై ఆసక్తి చూపుతున్నారు. మిట్ట ప్రాంతం, తక్కువ నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు పూల సాగు చేస్తున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో కూలీలు దొరక్క వాణిజ్య పంటల సాగు చేపడుతున్నారు. రామగిరి, అప్పంబట్టు, అడవికండ్రిగ, కీళపూడి, శేషంపేట, అక్కంగారి పేట, రెప్పలపట్టు, ఎస్ఎస్‌బీపురం, బంగాళ, మాలగుంట, శ్రీరామాపురంపేల, సత్యవేడు మండలంలో ఏఎంపురం, కన్నావరం, జడేరి, అల్లపుగుంట, రాచపాళెం కాళమనాయుడు పేట, దళవాయి అగ్రహారం, రాజులుకండ్రిగ, రాజుగుంట గ్రామాల్లో పూల సాగు చేస్తున్నారు. చిన్నకారు రైతులు అధికంగా ఎకరా, రెండెకరాలు కన్నా తక్కువ భూములు కలిగిన వారే పూల తోటలు సాగుపై దృష్టి సారిస్తున్నారు. రైతులు, కౌలు రైతులు ఇంటిల్లిపాది పూల మొక్కలు నాటిన మొదలు పంట కోత వరకు స్వయంగా తోటల్లో పనులు చేస్తున్నారు. పూల తోటల పెంపకంలో ఉద్యానవన అధికారులు అప్పుడప్పుడూ ఇస్తున్న సూచనలు సలహాలతో తెగుళ్ల బారి నుంచి పూల తోటలను కాపాడుకుంటూ తక్కువ ఖర్చుతో పూలతోటలు సాగు చేస్తున్నారు.

ఖర్చు తక్కువ.. రాబడి ఎక్కువ

రోజా సాగుకు దుక్కి మొదలు దిగుబడి వరకు ఎకరాకు రూ.లక్ష ఖర్చు కాగా మూడు టన్నుల పూల దిగుబడి వస్తుంది. ఆ పూలను విక్రయిస్తే రూ. 1.75 లక్షలు ఆదాయం వస్తోంది. సంపంగి సాగుకు ఎకరాకు రూ.70 వేలు ఖర్చు కాగా సుమారు పది టన్నుల పూల దిగుబడి వస్తుంది. తద్వారా రూ. 1.75 లక్షలు రాబడి వస్తోంది. మల్లి సాగుకు ఎకరాకు రూ. 60 వేల ఖర్చు కాగా నాలుగు టన్నుల పూల దిగుబడి రాగా రూ. 1.50 లక్షలు ఆదాయం చేకూరుతోంది. చామంతి సాగుకు ఎకరాకు రూ. 80 వేలు ఖర్చు కాగా సుమారు నాలుగు టన్నులు దిగుబడి వచ్చి రూ.1.40 లక్షలు రాబడి వస్తుంది.

రాజమండ్రి నుంచి విత్తన మొక్కలు

పిచ్చాటూరు, సత్యవేడు మండలాల్లో రోజా పూలు సాగు చేస్తున్న రైతులు రోజా పూల మొక్కలు రాజమండ్రి నుంచి తీసుకువస్తున్నారు. రాజమండ్రి మొక్కలతో అధిక దిగుబడి వస్తుందన్న నమ్మకంతో 20 ఏళ్లుగా ఆ మొక్కలనే నాటుతున్నామని రైతులు తెలిపారు.



రాచపాళెంలో సాగు చేసిన బంతిపూల తోట, (ఇన్‌సెట్) కాళమనాయుడుపేటలో కనకాంబరం తోట, పిచ్చాటూరులో సాగు చేసిన రోజా పూల తోట

12 వేల ఎకరాల్లో సాగు

సత్యవేడు, పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీపురం మండలాల్లో వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం సుమారు 12 వేలు ఎకరాల్లో రైతులు పలు రకాల పూలసాగు చేస్తున్నారు. రోజా, చామంతి, కనకాంబరం, మల్లి సంపంగి పూల సాగు చేస్తున్న రైతులకు శాస్త్రీయ పద్ధతులపై ఉద్యాన వనశాఖ అధికారులు సూచనలు, శిక్షణ సమావేశాలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

తమిళనాడులో విక్రయం

తమిళనాడులోని చెన్నై, సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం, పిచ్చాటూరు, సత్యవేడు మండలాలు సమీపంలోనే ఉండడంతో రైతులు తాము పండించిన పూలను వారే అద్దె వాహనాల్లో చెన్నైకు తరలించి విక్రయిస్తున్నారు. పూలు నాణ్యతగా ఉండేందుకు సత్యవేడు ప్రాంతంలో రైతులు సాయంత్రం నుంచి రాత్రి 8 గంటల వరకు పూలు కోస్తున్నారు. పిచ్చాటూరులో రాత్రి 10 వరకు పూలు కోసి చెన్నైకు తరలిస్తున్నారు.





పూలు కోస్తున్న మహిళలు, తోటకు ఎరువు వేస్తున్న రైతు

అవగాహన కల్పించాలి



రైతులు శాస్త్రీయపద్ధతులు, యాజమాన్య పద్ధతులు స్వల్పంగా పాటిస్తున్నారు. వృద్ధులు సూచనల ఆధారంగా పూల సాగు చేస్తున్నాం. క్రిమి సంహారక మందులు షాపుల్లో దొరికేవి తెచ్చి పిచికారీ చేయడంతో పురుగుతోపాటు మొక్కలు దెబ్బ తింటున్నాయి. నెలకోసారైనా ఉద్యాన వన అధికారులు మా పూల తోటలను పరిశీలించి, సాగులో మెళకువలు నేర్పాలి. –ఆర్. నటరాజన్, పూలరైతు, రాచపాళెం

సబ్సిడీ ఎరువులు ఇవ్వాలి



పూల రైతులకు ప్రభుత్వం ఎరువులు సబ్సిడీలో అందించాలి. వడ్డీ లేని బ్యాంకు రుణాలు మంజూరు చేసి పూల సాగు చేస్తున్న రైతులను ఆదుకోవాలి. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తున్న అధికారులు బ్యాంకు రుణాలు అందించేందుకు సహకారం అందించాలి. మహిళా సంఘాల్లోని రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రుణ సదుపాయం కల్పించాలి. –ధనమ్మ, మహిళా రైతు, రాచపాళెం

వంతెన నిర్మాణానికి భూమిపూజ

తొట్టంబేడు: మండలంలోని కల్లిపూడిలో తెలుగు గంగ కెనాల్‌పై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పిట్టగోడ నిర్మించండి



కరుణానది వంతెన వద్ద కూలిన పిట్టగోడ

వరదయ్యపాళెం: తడ–వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలో కదూరు సమీపంలోని కరుణానది వంతెనపై పిట్టగోడలు లేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెన పిట్టగోడలను ఇరువైపులా వాహనాలు ఢీకొనడంతో మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో నూతనంగా పిట్టగోడలను ఇప్పటిదాకా నిర్మించలేదు. దీని కారణంగా ఆ ప్రాంతంలో వాహనాలు అదుపు తప్పి అవతలి వైపు జారిపడే అవకాశం ఉంది. ఇటీవల ఓ లారీ ఆ ప్రాంతంలో అదుపు తప్పి ముందు చక్రాలు రెండూ అవతలి వైపునకు దూసుకెళ్లి ప్రమాదానికి గురైంది. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే పిట్టగోడలు నిర్మించి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

28న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం ఈ నెల 28వ తేదీ బుధవారం లెక్కించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల లెక్కింపు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాలన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి







సీతారాముల కల్యాణం చేస్తున్న వేదపండితుడు, బుచ్చినాయుడుకండ్రిగలో అన్నదానం చేస్తున్న భక్తులు, నాగలాపురంలో అన్నదానం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, కంచనపుత్తూరు, జోగికండ్రిగ, కల్లివెట్టు, పల్లమాల, నీర్పాకోట, కరకంబట్టు గ్రామాల్లో శ్రీహనుమాన్ జయంతిని శ్రీఆంజనేయస్వామి భక్త బృందం గురువారం ఘనంగా నిర్వహించింది. ముందుగా గ్రామాల్లోని దేవాలయాల్లో సీతారాముల విగ్రహాలకు అభిషేకాలు చేసి పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకాలు చేసి పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామాల్లో ఊరేగించారు. అన్నదానం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నాగలాపురంలో..

నాగలాపురం: గాంధీ వీధిలో ఉన్న శ్రీవీరాంజనేయస్వామివారి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు హరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి భక్త బృందం భక్తులకు ఉదయం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తిని సుందరంగా పూలమాలలతో అలంకరించి ఊరేగించారు.

వరదయ్యపాళెంలో..





వరదయ్యపాళెంలో ర్యాలీ, ఆంజనేయ స్వామివారి ఊరేగింపు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం సనాతన హిందూ ధర్మ సంస్థలైన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హనుమాన్ భక్త బృందం వరదయ్యపాళెం పురవీధుల్లో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద అన్నదానం నిర్వహించారు. బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు పురుషోత్తం, నాయకులు మురళి, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ ముత్తురాజు, హనుమంతప్పరెడ్డి, గుత్తి త్యాగరాజు, భరణి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. చిన్న పాండూరు సమీపంలో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహం వద్ద గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్త రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పూజల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

రేణిగుంట: మండలంలోని ఆంజనేయపురంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా మూడు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు మాంగల్యధారణ చేయించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కల్యాణోత్సవాన్ని తిలకించారు. మధ్యాహ్నం భక్తులకు స్వామివారి కల్యాణ విందును ఇచ్చారు. సాయంత్రం కోలాటాలు, పండరి భజన, బ్యాండ్ వాయిద్యాలు మధ్య స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

ఉద్యోగోన్నతులకు మోక్షమెప్పుడో?



మాట్లాడుతున్న ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నేతలు

శ్రీకాళహస్తి: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు ఆరేళ్లుగా ఉద్యోగోన్నతులు కోసం ఎదురుచూడడమే గానీ, ప్రభుత్వం ఎప్పుడు ఉద్యోగోన్నతులు కల్పిస్తుందో తెలియడం లేదని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం శ్రీకాళహస్తిలోని శ్రీహరి కళ్యాణ మండపం హాలులో ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ శ్రీకాళహస్తి డిపో సాధారణ సర్వసభ్య సమావేశం డిపో కార్యదర్శి పీఎస్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగులకు రావాల్సిన బకాయిలతోపాటు 11వ పీఆర్సీకి సంబంధించి 24 నెలలు అరియర్స్, నాలుగు డీఏ, అందుకు సంబంధించిన బకాయిలు, సరెండర్ లీవులు, లీవ్ ఎన్ క్యాష్ డబ్బులు ఇవ్వలేదన్నారు. దీంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారన్నారు. 2023 జూన్ నుంచి రావాల్సిన 12 వ పీఆర్సీకి సంబంధించి ఇంకా కమిషన్‌ను నియమించలేదన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించక పోవడం దారుణమన్నారు. మరో ముఖ్య అతిథి ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ శ్రీకాళహస్తి డిపో గౌరవాధ్యక్షుడు శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరి తారక శ్రీనివాసులు మాట్లాడుతూ నిరంతరం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం, సమస్యలు పరిష్కారం కృషి చేస్తున్నదీ ఎంప్లాయీస్ యూనియన్ మాత్రమేనని, ఇలాంటి సంఘానికి ఆర్టీసీ ఉద్యోగులంతా మద్దతు ఇచ్చి బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కుడుము అర్జున్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.మురగమ్మ, తిరుపతి జిల్లా ఆర్టీసీ ఈయూ గౌరవాధ్యక్షులు తాండాయం సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు జీఆర్ చంద్ర, జిల్లా కార్యదర్శి వి.మస్తాన్, డీఎస్ వర్మ, సుబ్రమణ్యం, సి.మధు, బి.శేషాద్రి, జె.సతీష్‌నాయుడు, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతులకు నష్టం



బుచ్చినాయుడుకండ్రిగలో వర్షానికి నేలరాలిన మామిడికాయలు



తడిసిన కాయలను వేరు చేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షంతో మామిడి, మిరప పంట రైతులు నష్టపోయారు. వర్షం పడడంతో చెరుకు, వరి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రైతులు చేతికి అందివచ్చిన 120 ఎకరాల్లోని మామిడి చెట్లలోని కాయలు నెల రాటాయి. 12 ఎకరాల్లోని మిరప పంట అకాల వర్షానికి దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మిరపకాయలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. దీంతో తడిచిన మిరపకాయలను ఆరబెట్టుకుంటున్నారు. అప్పులు చేసి పెట్టిన పంటలు దెబ్బతినడంతో రైతులు బాధపడుతున్నారు.

పత్తాలేని ఉద్యానశాఖాధికారులు

వారం రోజులుగా అకాల వర్షాలతో సతమతమవుతున్న రైతులను పట్టించుకోవాల్సిన ఉద్యానశాఖాధికారులు పట్టించుకోవటం లేదని రైతులు అంటున్నారు. నష్టపోయిన పంటల వివరాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయి, నష్ట పరిహారం అందేలా చూడాల్సినవారు ఆ సంగతిని మరచిపోయారని రైతులు తెలిపారు.

హెచ్చరిక బోర్డు తీసేయాలని నిరసన



రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు రెవెన్యూ పరిధిలో ఉన్న కాలువ పోరంబోకు, శ్మశానం భూముల దగ్గర రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తీసివేయాలని గురువారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ నగర్ కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలారివెట్టు గ్రామ రెవెన్యూ పరిధిలోని గొడ్డేరువాగు పక్కన సర్వే నంబర్లు 86, 83లో 3 ఎకరాల 83 సెంట్లు భూమిని స్థానికేతరుడు ఆక్రమించుకుని ఉన్నాడని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈభూమి గ్రామ అవసరాల కోసం కొంత, మిగిలిన భూమిని భూమిలేని వారికి ఇవ్వాలన్నారు. అయితే రెవెన్యూ అధికారులు బుధవారం ఇది ప్రభుత్వ భూమి అని, ఎవ్వరూ ప్రవేశించకూడదని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడం దారుణమన్నారు. సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని వినియోగించుకోండి



దివ్యాంగ బాలునితో మాట్లాడుతున్న జిల్లా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి

ఏర్పేడు: దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక విద్యను అందించేందుకు మండలంలోని భవిత కేంద్రాన్ని వినియోగించుకోవాలని జిల్లా సమన్వయకర్త డి.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. రేణిగుంటలో గురువారం జరుగుతున్న సీడబ్ల్యూఎస్ఎన్ సర్వేను ఆయన తనిఖీ చేసి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లల్లో మానసిక, శారీరక పరివర్తనను తీసుకొచ్చేందుకు భవిత కేంద్రాలు ఉపయోగపడుతాయన్నారు. దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రాల్లో తప్పనిసరిగా చేర్పాలన్నారు. సర్వే సమగ్రంగా జరిపి బడిఈడు దివ్యాగ పిల్లలంతా భవిత కేంద్రాలలో చేరేలా కృషి చేయాలని ఆయన ఐటీఆర్‌టీ జేష్మకు సూచించారు.

పరశురామేశ్వరుడి సేవలో సీఐఎస్ఎఫ్ డీఐజీ

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో ఉన్న పరశురామేశ్వరాలయాన్ని గురువారం చెన్నై ఎయిర్‌పోర్ట్ సీఐఎస్ఎఫ్ డీఐజీ ఆర్.పొన్ని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు మేళతాళాలతో స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ విశిష్టతను గురించి ఆమెకు వివరించారు. దర్శనానంతరం పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

కూలీల మస్టర్ల పరిశీలన



మస్టర్ పరిశీలిస్తున్న ఈసీ భానుశేఖర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల మస్టర్లను గురువారం ఈసీ భానుశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఏకాంబరంతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పూడికతీత పనుల్లో 82 మంది కూలీలు ఉన్నారని, పనికి రానివారి పేర్లు మీద మస్టర్లు వేయలేదని తెలిపారు. కూలీలు కష్టపడి పనిచేస్తే రోజుకు రూ.307 కూలీ గిట్టుబాటు అవుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీ నాయకుల కక్ష సాధింపు

కాటూరు గ్రామ ఉపాధి ఫీల్ అసిస్టెంట్ ఏకాంబరంపై లేనిపోని ఆరోపణలు చేసి, తొలగించడానికి టీడీపీ నాయకులు కక్షగట్టుకున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు తెలిపారు. కష్టపడి పనిచేసే వారిపై ఇలాంటి ఆరోపణలు చేయడం దారుణమని, కక్ష సాధింపులు మానుకోకపోతే ఊరుకోమని హెచ్చరించారు.